# మందు ఖరీదెంత?

'ఉచిత నేత్ర వైద్యశాల'

ఊరికంతా కనిపించేటంత పెద్ద బోర్డు!

"పోండి, పోండి - వుచిత నేత్ర వైద్యమనగానే ఎందుకూ పనికిరాని అడుక్కుతినే వుల్లా వెధవలంతా వచ్చేస్తున్నారు. చెప్పేది మీకే. పోండి. ఓరి ముసలోడా! చెప్పుతుంది వినిపిస్తోందా - లేదా? కళ్ళతోపాటు చెవులు కూడా పోయాయా?"

తెల్లటి బట్టలేసుకుని గాంధీ టోపీ పెట్టుకున్న కాంపౌండర్లు కాట్ల కుక్కల్లాగా మీదపడి బయటికి తరిమి కొట్టేశారు.

సత్తి తండ్రి చెయ్యి పట్టుకుని, "పదవే అయ్యా! ఈళ్ళు మనసంటోళ్ళను సూడరు" అంటూ వెనక్కి లాగింది.

కాని, నాగడు ఆశ ముందుకు లాగుతూంది.

"బాబ్బాబు! సచ్చి నీ కడుపున పుట్టా. ఆ డాక్టరు బాబు వచ్చేదాక ఈడే కూకుంటాం. ఆ బాబు కాళ్ళ మీద పడతాను. దరమ పెబువు దయ సూపిత్తాడు. నా కంటికి ఆపరేసను సేత్తాడు..."

"ఆఁ, చేస్తాడు - చేస్తాడు. ముందు మా పెళ్ళి చేస్తాడు - మిమ్మల్ని లోపలికి రానిచ్చి నందుకు" అన్నాడొకడు.

"డాక్టరు బాబుకి చెయ్యి తడపనిదే కన్నెత్తి కూడా చూడడు. నీలాంటి అడుక్కుతినే వెధవలకు ఆయన ఉచిత వైద్యం చేస్తాడనుకుంటున్నావా ఏం?" అన్నాడు మరొకడు.

వాళ్ళకు డాక్టరు గారి దొడ్డ మనస్సు తెలుసు మరి!

"పోరా ముసలోడా! నీకు కళ్ళు లేకపోతే ఈ లోకానికేం నష్టం లేదు. ఫోఫో -" అని గేటు బయటికి తరిమేశారు.

"పదవే తల్లీ, పదా! అందరూ ఈడ దరమానికి కంటి ఆపరేషను సేత్తారంటే ఆశపడి వచ్చా-" కర్ర పోటేసుకుంటూ కూతురు సత్తి వెనకాల నడిచాడు నాగడు.

"నేను ముందే చెపితే యిన్నావా? రా-రా అని లాక్కొచ్చావు. అయిందా సమ్మెడం. ఎండెక్కి పోనాది, బేగి రాయే అయ్యా!" అంటూ సత్తి అడుగులు వడివడిగా వేయసాగింది.

కాని పాపం - నాగడు అడుగులు, కూతురంత వడిగా పడటం లేదు. వెనకపడిపోతున్నాడు.

దానికి కారణం వయస్సులో వున్న వార ఒక్కటే కాదు - నాగడు అవిటి వాడు. ఒక కాలు కుంటి. కఱ్ఱ పోటేసుకుంటూ నడుస్తాడు. పైగా ఈ కళ్ళ మసకలొకటి. అంతవరకు చూపు బాగానే వుండేది. ఈ మధ్యనే కళ్ళల్లో పువ్వులు పుట్టాయి. ఎదర వున్నవి అంతా మబ్బుమబ్బుగా, మసగ్గా అలికేసినట్లు కనిపిస్తున్నాయి.

"అయ్యా! నీవు మరీడ కూకుంటావా? సింత తోటకెళ్ళి కూస్ని గంజినీళ్ళు కాసుకొత్తాను" అంది.

ఇలాటి దిక్కులేని వాళ్ళను ఆదరించే చల్లని తల్లిగా, అంబేద్కర్ కాలేజి ఎదురుగా ఒక పెద్ద చింత తోట ఉంది. ఆ దిక్కులోని పక్షులన్నీ అక్కడికి చేరుతాయి. ఏ చెట్టుక్రిందో మూడురాళ్ళు పెట్టుకుని గంజినీళ్ళు కాచుకుంటారు. ఆ చెట్ల చల్లని నీడలో రవ్వంతసేపు కునుకు తీస్తారు.

నాగడు కళ్ళు చికిలించుకుని చూస్తూ, "ఎంకటేస్సర సామి గుడే కదా తల్లీ? ఈ గుడే మనకు దిక్కు!" అంటూ, ఒక లైటు స్తంభం దగ్గర సర్దుకుని కూర్చున్నాడు.

"మర్నేవొత్తా! డబ్బులు డబ్బా జాగర్త!" అంది.

"కసింది మొక్కలేడన్నా కనిపిత్తాయేమో సూడే బుల్లీ! ఆటి పాలు కళ్ళల్లో పిండుకుంటే గాని ఈ చుక్లాలు నయిం కావు-" అని కేకపెట్టాడు.

"సూత్తాలే!" అని, సత్తి తొందర తొందరగా చింతతోట వయిపుకు సాగిపోయింది.

"కంటి ఆపరేసనని వెళ్ళావు, ఏమయింది? సేత్తామన్నారా?" అని కుష్ఠు ఈశూబు పలకరించాడు.

నాగడు బదులు చెప్పలేదు. ఆలోచనలో పడ్డాడు. మనస్సంతా దిగులు క్రమ్ముకుంది - ఈ పిల్ల దాని బతుకెట్టా కడతేరుతుందో? దానికొక అండ దొరికితే, దాని బతుకొక దరిజేరితే సూసుకొని తను ఈ ముసలి పేణం వదిలేత్తాడు.

నాగడి మనస్సులో ఒక ఆలోచన వచ్చింది. తళుక్కున ఒక రూపం మెదిలింది. ఒక ఆశ పొడచూపింది. అది రిక్షా రంగడు. మనిషి మంచోడు లాగా వుంటాడు. తన కూతురంటే ప్రాణం పెట్టుతాడు. వాడికి వెనకా ముందు ఎవరూ లేరు. వాడి అండలో తన బంగారు తల్లి బతుకు ఎట్టాంటి చీకూ చింతా లేకుండా ఎల్లమారిపోతుంది.

ఇలా ఇక్కడ నాగడు తన మనస్సులో ఒక చిన్న ఆశకు వూపిరి పోసుకుంటున్న సమయంలో అక్కడ చింత తోటలో -

ఒక పెద్ద చెట్టు చల్లని నీడలో నూకల గంజి కాస్తోన్న సత్తితో రంగడు - "ఈ దశేరా పండుక్కే నిన్ను నా గుడిశకు తోలుకుపోతానే సత్తీ!" అని అంటున్నాడు.

సత్తి నల్లటి చెంపల్లో సిగ్గు! దాని లేత గుండెల్లో పులకరింపు! కొన్నాళ్ళ క్రిందట ఏర్పడ్డ వారి పరిచయం, రోజు రోజుకూ రెమ్మలూ, కొమ్మలూ వేయసాగింది.

ఈ మధ్య ఒక చీకటి చలిరాత్రి ఒక షాపు అరుగుల మీద సత్తి - అప్పటిదాక 'మొగవాసన' చూడని నికార్సయిన 'కన్నెగుంట' అని రంగడు తెల్సుకున్నాడు. నిజంగానే మనస్సు యిచ్చాడు. మనువాడతానని ముందుకొచ్చాడు.

* * *

ఆనాటి రాత్రి బాగా ప్రొద్దు పోయాక ఏదో కొట్టు అరుగుల మీద -

సత్తి తండ్రితో ఏదో చెప్పాలని - చెప్పటానికి సిగ్గు అడ్డు వచ్చి "అయ్యా... మరీ... అయ్యా..." అంది. "ఏంటే? పిచ్చి సన్నాసి?" అని అన్నాడు నాగడు ప్రేమగా.

ఆరోజు ఉదయం రంగడు తనతో చెప్పిన మాటను మెల్ల మెల్లగా, సిగ్గుసిగ్గుగా, సగం సగంగా, "ఈ దశేరా పండుక్కే - ఆడు - అదేనే అయ్యా, ఆడు లేడు - రం-గ-డు నన్ను ఆడి గుడిశకు తోలుకు పోతాను అన్నాడు..." అని తన అయ్యతో చెప్పింది.

నాగడికి మొదట అర్థం కాలేదు. అర్థమయ్యాక యమ సంబరపడిపోయాడు.

* * *

రెండు రోజుల తర్వాత ఒక మధ్యాహ్నం అజాంబాద్ (హైదరాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాగా పిలవబడే ప్రాంతం) లోని పొగ గొట్టాలు వదిలే పొగకూ, రకరకాల వాసనలకూ తట్టుకోలేక సూర్యుడు పడమటి దిక్కు నయిపుకు పారిపోతున్న సమయంలో -

నాగడు, కూతురు సత్తి వెనకాల కర్ర పోటేసుకుంటూ పోతున్నాడు.

తండ్రీ కూతుళ్ళ అడుగులు వడివడిగా, వుషారుగా పడుతున్నాయి.

"ఆ కసింది మొక్కలేడున్నాయని సెప్పాడే రంగడూ?"

"ఈడేనే అయ్యా! నూనె కంపెనీ కాడ సూశానని సెప్పాడే" - అని అంటూ ఒక చోట ఆగింది.

నూనె కంపెనీ కెదురుగా వున్న ఖాళీ స్థలంలో చాల పిచ్చి మొక్కలున్నాయి. వాటిల్లో ఆ కసింది మొక్కలు కూడా వున్నాయి. సత్తి మొగం వికసించింది. "ఇగ్గో! ఈడున్నాయి అయ్యా!" అంది.

నాగడు తన జోలీ, చేతికర్రా, డబ్బా ఒక ప్రక్కన పెట్టి గొంతుక్కూర్చున్నాడు.

ఆ ఆకుల్ని చేత్తో పట్టుకుని తడిమి చూచి, సంతోషంగా "ఈ ఆకులేనే బుల్లీ!" అన్నాడు.

"ఆటి రసం మెల్లగా నా కళ్ళల్లోకి పిండు. మనసుమంటోళ్ళకు ఈటి పాలే మందూ, ఆపరేషనూ, మూడు రోజులు వరుసగా పిండుకుంటె సుక్లాలూ, గిక్లాలూ పోతాయి."

ఇలా అంటూ సత్తిచేత తన రెండు కళ్ళల్లోనూ ఆ పాలు పిండించుకున్నాడు.

"అయ్యా! రెండు రోజులమట్టీ నాకూ వూకే కళ్ళు మంటపెట్టుతున్నాయి. ఈటికి కళ్ళ మంటలు పోతాయా అయ్యా?" అని అమాయకంగా అడిగింది సత్తి.

"అన్నీ పోతాయే పిచ్చిసన్నేసి! రా- రా ఇట్టా రా, కూకో! నీ కళ్ళల్లో నేను పిండుతా. ఇప్పుడంటే ఈ ఆచుపత్తుర్లూ, ఈ ఆపరేసనులూ వచ్చాయిగానీ, మాసిన్నప్పుడు ఇసుమంటి వైజ్జగాలే కదే పిచ్చి సన్నేసి!" అని అంటూ సత్తి రెండు కళ్ళల్లో ఆ పాలు పిండేడు.

కళ్లు మూసుకుని యిద్దరూ ఎదురు బొదురుగా కూచున్నారు.

రెండు నిమిషాలయ్యేసరికి యిద్దరికీ కళ్ళు మంటలు పుట్టటం మొదలు పెట్టాయి. క్రమంగా ఆ మంటలు ఎక్కువయి, కళ్ళు భగ్గున మండిపోతున్నట్లనిపించ సాగాయి. కనుగ్రుడ్లలో వాడి సూదులు గ్రుచ్చుతున్నట్లూ, కనుగ్రుడ్లను పీకేస్తున్నట్లూ భరింపరాని బాధ!

సత్తి ఆ బాధను తట్టుకోలేక కేకలు పెడుతూ ఏడవసాగింది.

నాగడు కూడా ఆ బాధకు విలవిల్లాడిపోయాడు. హృదయ విదారకంగా రోదించసాగాడు.

వాళ్ళ కేకలూ, ఏడ్పులూ ప్రక్కనే వున్న యాసిడ్ ప్లాంట్ సైరన్ కూతలో కలిసిపోయాయి.

సూర్యుడు ఏమీ తెలియనట్లు, ఏమీ పట్టనట్లూ మొగం చాటేసుకుని జారుకొంటున్నాడు.

కాని, ఆ సూర్యుడికి తెలుసు - ప్రక్కనే వున్న యాసిడ్ ప్లాంట్ వాళ్ళు రోజూ అనేక రకాల ద్రావకాల మడ్డి నీళ్ళను గోడకి అవతలవైపు పోస్తారనీ, ఎన్నాళ్ళగానో ఆ ద్రావకపు నీళ్ళను పీల్చిన ఆ ఆకుల్లోని పాలు కంటి జబ్బులను నయం చేయలేవు సరికదా - వున్న కళ్ళను కాస్తా పోగొట్టుతాయనీన్నూ!

* * *

చిక్కడపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి గుడి ముందు పూర్తిగా కళ్ళు కనిపించని యిద్దరు తండ్రీ కూతుళ్ళు కూర్చుని, "అయ్యా! కళ్ళులేని కబోదులమయ్యా!" అని అడుక్కుంటే వున్నారు.

వాళ్ళు- నాగడూ, వాడి కూతురు సత్తీన్నూ.

నాగడు కాసేపు మౌనంగా వున్నాక, "రంగడు పత్తా లేకుండా పోయాడేంటే?" అన్నాడు.

"ఆళ్ళూరెళ్ళాడంటనే అయ్యా! ఆడు తప్పకుండా వస్తాడు. నన్ను ఆడి గుడిశెకు తోలుకు పోతాడు" అంది సత్తి ఆత్మ విశ్వాసంతో.

అప్పుడు కొత్తగా పెళ్ళయిన దంపతులు దేముడి దర్శనం చేసుకుని బయటికి వచ్చారు. గుడి మొదలలోనే కూర్చున్న సత్తి మనుషుల అలికిడి విని, "అయ్యా! కళ్ళులేని కబోదిని బాబాయ్యా!" అంది. తన చేతిలోని బొచ్చెను ఎత్తి పట్టుకుని.

ఆ బొచ్చెలో ఆ దంపతులు చిల్లర డబ్బులు వేశారు.

ఆ జంట ఎవరో కాదు - రంగడూ, వాడి కొత్త పెళ్ళామున్నూ.

రంగడు ఒక్క క్షణం నిలబడి బరువు గుండెలతో సత్తిని తేరిపార చూసి, దీర్ఘంగా నిట్టూర్చాడు!

- 'విజయ' మాసపత్రిక జనవరి 1978

★